సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



ఇక మూల్యఅంకం


ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు శనివారం నిర్వహించిన సోషల్ స్టడీస్‌తో ప్రశాంతంగా ముగిసాయి. - 8లో ▸




జైలు పక్షులే తోడు దొంగలు

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల్ని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో ▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు సోమవారం యథా విధిగా నీటిని విడుదల చేశారు. మూడు డెల్టాకు 4,850క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సీఎం సహాయ నిధి నుంచి రెండో విడత రూ.9 లక్షలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం నారాయణపేటకు చెందిన తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తొమ్మిదేళ్ల యశ్వంత్‌కు వైద్యం నిమిత్తం ఇప్పటికే సీఎం సహాయ నిధి నుంచి రూ.12 లక్షలు విడుదలయ్యాయి. పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు సీఎం జగన్‌ను గతంలో కలిసి యశ్వంత్ వ్యాధి, కుటుంబ పేదరికం గురించి చెప్పగానే స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ.21 లక్షలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో రూ.12 లక్షలు మూడు నెలల కిందటే విడుదల చేయగా మిగిలిన నిధులు రూ.9 లక్షలను సోమవారం విడుదల చేశారని కుడుపూడి బాబు తెలిపారు. ఇప్పటికే రోగి యశ్వంత్‌కు హైదరాబాద్‌లో వైద్యం మొదలైందని, ఇప్పుడు విడుదలైన రూ.9 లక్షలతో ఆ బాలుడికి పూర్తి స్థాయి వైద్యం అందనుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు బాబు కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎం.కమలకుమారి తెలిపారు. జిల్లాలో 46 పరీక్షా కేంద్రాలలో జరిగిన సంస్కృతం పరీక్షకు 2,180 మందికి 2,180 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ప్రత్యేక స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ తెలిపారు.

వేట నిషేధ భృతి చెల్లింపునకు వివరాలు నమోదు

వచ్చేనెలలో వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద సహాయం



కాకినాడ కుంభాభిషేకం వద్ద వైఎస్సార్ మత్స్యకార భరోసా కోసం సోమవారం ఉదయం లబ్ధిదారులు, బోట్ల గుర్తింపు చేపట్టిన మత్స్యశాఖ అధికారులు

కాకినాడ రూరల్: చేపల వేట విరామ సమయంలో మత్స్యకారులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. వచ్చేనెల రెండో వారంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా వేట నిషేధ భృతిగా కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందించనుంది. ఇప్పటికే మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు ఆదేశాలతో ఆ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. షెడ్యూల్ ప్రకారం ఒక్క రోజులోనే వేటకు వినియోగించే బోటు పరిశీలించి, ఫిట్‌నెస్ చూడడంతో పాటు మత్స్యకారులను సోమవారం గుర్తించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ పర్యవేక్షణలో తుని నుంచి తాళ్లరేవు వరకు గల ఏడు తీర ప్రాంత మండలాలలో గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. ఇందుకు జిల్లాతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు, కాకినాడలోని ఎస్ఐఎఫ్‌టీలోని ట్రైనీలను రంగంలోకి దించారు. 85మందితోకూడిన 23 బృందాలు బోట్లను గుర్తించే పనిలో పాల్గొన్నాయి. కళాసీలు, మత్స్యకారులను వీరు గుర్తించారు. బోట్‌పై మత్స్యకారుల ఫొటోలను తీసుకున్నారు.

కోవిడ్‌తో ఇద్దరు యువకుల మృతి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో కోవిడ్ సోకి చికిత్స పొందుతున్న ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. వై.రామవరానికి చెందిన 21 ఏళ్ల ప్రసాద్‌తో పాటు, పెనికేరుకు చెందిన 26 ఏళ్ల సందీప్ కోవిడ్ చికిత్స పొందుతూ మృతి చెందారు. వీరిలో ప్రసాద్ కోవిడ్ అనుబంధ వైరల్ నిమోనియాకు గురికాగా, సందీప్ కోవిడ్ సోకి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు గురై మృత్యువాత పడ్డాడు. బాధితులిద్దరూ జీజీహెచ్‌లోని కోవిడ్ ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

కొండెక్కిన బొండాం





మీడియం, చిన్న సైజు బొండాల విక్రయాలు

- తగ్గిన దిగుబడి.. పెరిగిన ధరవడి
- రైతువారీ రూ.12 నుంచి రూ.14
- రిటైల్ మార్కెట్‌లో రూ.25 నుంచి రూ.35
- తెల్లదోమ వల్ల 30 శాతం తగ్గిన దిగుబడి

సాక్షి అమలాపురం: అమృతభాండంగా పేరొందిన కొబ్బరి బొండాం ధర కొండెక్కింది. పంట అధికంగా ఉన్న గోదావరి జిల్లాల్లోనే బొండాలు ప్రియంగా మారాయి. తెల్లదోమ కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గడంతో బొండాల ధరలకు రెక్కలొచ్చాయి. కొబ్బరి బొండాం రైతువారీ ధర రూ.12 నుంచి రూ.14 వరకు పలుకుతోంది. బొండాలు అధికంగా దొరికే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లోనే ఈ ధరలు అధికంగా ఉన్నాయి. వీటితోపాటు జిల్లాలోని లంక గ్రామాల నుంచి వచ్చే బొండాలకు సైతం ధరలు పెరిగాయి. రైతు వారీ ధర పెరగడంతో మార్కెట్‌లో సైతం బొండాల ధర పెరిగింది. కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోనే బొండాల ధర రూ.25 నుంచి రూ.35 వరకు ఉంది. మిగిలిన పట్టణాల్లోనే కాదు... బొండాలు అధికంగా దొరికే లంక గ్రామాల్లో సైతం బొండాల ధర రూ.20కి తగ్గకపోవడం విశేషం.

దిగుబడి .. సైజు తగ్గింది

కొబ్బరి బొండాల దిగుబడి గణనీయం తగ్గిపోయింది. కొబ్బరిని రూగోస్ వైట్ ఫ్లై (తెల్లదోమ) సోకిన తరువాత 30 శాతం దిగుబడి తగ్గిందని ఉద్యానశాస్త్ర వేత్తలు చెబుతున్నారు. బొండాలు ఎక్కువగా వచ్చే గోదావరి గంగ, గంగా బొండాం, చౌగాట్ గ్రీన్ డార్ఫ్, ఎల్లో డార్ఫ్ వంటి సంకరజాతి, పొట్టి రకాల చెట్ల మీద తెల్లదోమ ఉధృతి మరింత ఎక్కువగా ఉంది. వీటి దిగుబడి 40 శాతం నుంచి 50 శాతానికి తగ్గింది. దిగుబడి తగ్గడంతోపాటు బొండాం సైజు సైతం తగ్గింది. బొండాంలో నీటి లభ్యత కూడా చాలా తక్కువగా ఉంటోంది. గతంలో మీడియం సైజు ఉన్న రెండుమూడు బొండాల నుంచి లీటరు వరకు నీరు వచ్చేది. ఇప్పుడు లీటరు నీరు రావాలంటే ఐదారు బొండాలు కొట్టాల్సి వస్తోంది అని బొండాల వ్యాపారి త్రిమూర్తులు 'సాక్షి'కి తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలోని జంగారెడ్డిగూడెం, నల్లజర్ల, దెందులూరు, చింతలపూడి ప్రాంతాల నుంచి అధికంగా కొబ్బరి బొండాలు హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి జరిగేవి. కాని ఇక్కడ కూడా దిగుబడి తగ్గింది. ఇప్పుడు దిగుబడి వస్తున్న బొండాలన్నీ హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. దీంతో జిల్లాతోపాటు తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు కొవ్వూరు, పెరవలి, గోపాలపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లి, కపిలేశ్వరపురం, మామిడికుదురు. ముమ్మిడివరం, పి.గన్నవరం మండలాల్లోని లంక గ్రామాల నుంచి బొండాల ఎగుమతి చేయాల్సి వస్తోంది. ఈ కారణాల వల్ల బొండాలకు రిటైల్ మార్కెట్‌లో డిమాండ్ పెరిగి ధర పెరగడానికి కారణమైంది.

అమృత భాండమే..

- కొబ్బరి బొండాం అమృత భాండమే. వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగించి, తక్షణ శక్తినిస్తుంది. శరీరంలో సహజ లవణాల్ని కోల్పోయినప్పుడు కలిగే అలసట నుంచి కొబ్బరి నీరు కాపాడుతుంది. వడదెబ్బకు గురైనవారికి తక్షణ ఉపశమనం కలిగించేది కొబ్బరి బొండమే.
- మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, సోడియం, జింక్ వీటిలో ఉంటుంది. గర్భవతులు, మలబద్ధకం ఉన్నవారు వినియోగిస్తే మంచిది. జీర్ణకోశంలో తేడాలు, గుండెలో మంటను కొబ్బరి నీరు సేవించడం ద్వారా అధిగమించవచ్చు.
- బిడ్డకు పాలు ఇచ్చే తల్లులు కొబ్బరి నీటిని తాగితే పాల ద్వారా వారి బిడ్డలకు అనేక పోషకాలు అందుతాయి. కొబ్బరి నీరు తల్లి పాలలో లారిక్ యాసిడ్‌ను పెంచుతుంది. దీనిలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు ఉంటాయి.
- గుండెజబ్బులకు అధిక రక్తపోటు ప్రధాన కారణం. పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు రక్తపోటును తగ్గించడంలో సహకరిస్తాయి. కొబ్బరి నీరు మూత్ర వ్యవస్థలపై థెరపటిక్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. మూత్రకోశ ఇన్‌ఫెక్షన్‌లు, మూత్రపిండంలో రాళ్లను తగ్గించడంలో సహాయపడుతుంది.

ఉత్తమ యాజమాన్య పద్ధతులు



కొబ్బరిపై తెల్లదోమ ప్రభావం ఎక్కువగా ఉంది. కాయ సైజు, దిగుబడి తగ్గుతోంది. యాజమాన్య పద్ధతులు పాటించడం తప్పనిసరి. ఈ ప్రాంత రైతులు కొబ్బరి చెట్టుకు నాలుగు వైపులా గుంతలు తీసి ఏడాదికి ఒకసారి ఎరువులు వేస్తుంటారు. అలా చేయడం కన్నా చెట్టు చుట్టూ పల్లాలు వేసుకుని యూరియా, సూపర్, పొటాష్‌లు సమపాళ్లలో జల్లుకోవాల్సి ఉంది. పసుపు రంగు జిగురు అట్టలు కట్టడం, బదనికలు వదులుకోవడం ద్వారా తెల్లదోమను అదుపు చేస్తే పాత దిగుబడి వస్తుంది.

– నేతల మల్లికార్జునరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

సేకరణ తక్కువ... పైగా గిట్టుబాటు కాదు



గోదావరి లంకల్లో కొబ్బరి బొండాం సేకరణ గతంలో ఎక్కువగానే ఉండేది. ఈ ఏడాది మిగిలిన ప్రాంతాల్లో దొరక్కపోవడంతో లంక గ్రామాల నుంచి తప్పనిసరిగా కొబ్బరి కాయను అధికంగా సేకరిస్తున్నారు. మంచి ధర ఉంది. కాని దిగుబడి గతంలో మాదిరి లేదు. కాయ సైజు తగ్గడం వల్ల పెద్దగా గిట్టుబాటు కావడం లేదు.

– పెదమల్లు నాగబాబు, పాశర్లపూడిలంక, మామిడికుదురు మండలం



అమృత భాండం

వైభవంగా కల్యాణోత్సవాల నిర్వహణ



సమావేశంలో పోలీసు ఏర్పాట్లను వివరిస్తున్న సీఐ కిషోర్‌బాబు

అన్నవరం: రత్నగిరిపై ఈ నెల 30 నుంచి వచ్చే నెల 6 వరకూ నిర్వహించే సత్యదేవుని కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ కోరారు. కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వశాఖలు, దేవస్థానం అధికారుల సమన్వయ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ప్రధానంగా మే ఒకటో తేదీ రాత్రి జరుగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను ఈఓ వివరించారు. వివిధ శాఖల అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందించి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి వివిధ కారణాలతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, జిల్లా స్థాయి అధికారులు హాజరు కాలేదు. దీంతో వారందరి సమక్షంలో మరోసారి సమావేశం నిర్వహించి ఉత్సవాలకు చేపడుతున్న ఏర్పాట్లపై సమీక్షించాలని నిర్ణయించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, ప్రత్తిపాడు సీఐ కిషోర్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలు

- సత్యదేవుని కల్యాణోత్సవాల్లో భాగంగా కొండ దిగువన జరిగే స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో డ్రోన్ సాయంతో పూలు జల్లాలని నిర్ణయించారు.

గోటి తలంబ్రాలు

ఈసారి సత్యదేవుని దివ్యకల్యాణానికి గోటి తలంబ్రాలు వినియోగిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఈ తలంబ్రాలను, భక్తులు, మహిళలతో ఒలిపిస్తున్నట్లు చెప్పారు. స్వామివారి కల్యాణానికి డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కల్యాణ తలంబ్రాలు సమర్పిస్తారని ఈఓ తెలిపారు.

బీసీలను మభ్య పెట్టే ప్రకటనలు మానుకో

లోకేష్‌కు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు సూచన



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు. పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎన్నికలు వస్తున్నాయని బీసీల రాగం మొదలు పెట్టాడని.. బీసీలను మభ్య పెట్టే ప్రకటనలు చేస్తే వారు నమ్మే పరిస్థితుల్లో లేరని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురంలోని సూర్యనగర్ కమ్యూనిటీ హాలులో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విషయ పరిజ్ఞానం లేకుండా, కనీస అవగాహన లోపంతో మాట్లాడి పరువు తీసుకోవద్దని ఆయన లోకేష్‌కు సూచించారు. కర్నూలు జిల్లాలో పాదయాత్ర నిర్వహిస్తున్న లోకేష్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీల రక్షణకు ఓ ప్రత్యేక చట్టం తీసుకుని వస్తామని ప్రకటించడం అతనికి చట్టాలపై ఎంతటి అవగాహన ఉందో తెలియజేస్తోందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో ఆయన రాజ్యాంగాన్ని, రాష్ట్రపతిని, సుప్రీంకోర్టు వంటి వ్యవస్థలను అవమానించారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి చట్టసభలకు వచ్చే సత్తా కూడా లేని లోకేష్ బీసీల రక్షణకు కొత్త చట్టం తీసుకుని వస్తానని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో 11 మంది బీసీలకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారన్నారు. ఎప్పుడూ రాజ్యసభ మెట్లు కూడా ఎక్కని బీసీలకు నాలుగు రాజ్యసభ సీట్లు ఇచ్చి ఆ సభకు సగౌరవంగా పంపించారని వివరించారు. ఇదీ జగన్‌కు బీసీల పట్ల ఉన్న విధేయత అని చెప్పారు. అమలాపురం అల్లర్ల కేసుల్లో విద్యార్థులు, యువకులు అధికంగా ఉన్నారని తెలుసుకున్న జగన్ వారి భవిష్యత్తు కోసం ఆలోచించి ఆ కేసులు ఎత్తివేత నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇదీ బీసీలకు జగన్ కల్పిస్తున్న రక్షణలో ఒక అంశమని గుర్తు చేశారు. బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వాటికి చైర్మన్లు చేశారని తెలిపారు. వచ్చే 2024 ఎన్నికల్లో బీసీలందరూ జగన్‌కు పూర్తి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల మద్దతు

- ఎంపీ చింతా అనురాధ
- సీసీ రోడ్డుకు భూమి పూజ



ముమ్మిడివరంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజా మద్దతుకు కొదవ లేదని అమలాపురం పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 216 జాతీయ రహదారి నుంచి భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం వరకు రూ.20 లక్షల ఎంపీలాడ్స్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డుకు సోమవారం ఆమె ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తననెంతో ఆదరించిన ముమ్మిడివరం నియోజకవర్గానికి ఎంపీ లాడ్స్ నిధులు సమకూర్చి అభివృద్ధికి దోహద పడతానన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20లక్షలు సమకూర్చానన్నారు. అనాతవరంలో స్వర్గీయ పీవీ రావ్ ఘాట్ నిర్మాణ విషయం సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికితీసుకు వెళ్లి దాని అభివృద్ధికి ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి రూ.10కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పట్ల ప్రజలలో సానుకూల స్పందన లభిస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి కావడడం ఖాయమన్నారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, కమిషనర్ జి.లోవరాజు, టౌన్ పార్టీ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, వైస్ చైర్మన్ రెడ్డి హేమ సుందరి శివన్నారాయణ, కోలాబాబ్జీ, వేగిరౌతు రాజబాబు, కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గడువులోగా అర్జీల పరిష్కారం



అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



అర్జీదారుల సమస్యలను వింటున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యలపై తక్షణమే స్పందించి నిర్దేశిత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా స్థాయి అధికారులతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జీవీ సత్యవాణి 230 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, సమస్య మండల స్థాయికి చెందినది అయితే వెంటనే అక్కడి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు వారి పరిధిలోని అర్జీలను నిర్ణీత గడువులోగా, సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలన్నారు. స్పందన పోర్టల్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో సంబంధిత అధికారి లాగిన్‌లో ఓపెన్ చేసి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని, సమస్య తమ పరిధిలోనిది కానట్లయితే సరైన కారణాలు స్పష్టంగా చూపుతూ తిరస్కరించాలన్నారు. పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు కె.చంటిబాబు సీహెచ్ ఎన్‌వీ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణారావు, జిల్లాగృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్ సీహెచ్ బాబురావు, డీసీహెచ్ఓ డాక్టర్ పద్మశ్రీ రాణి, సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కాకి నాగేశ్వరరావు, డీఎంహెచ్ ఓ ఎం.దుర్గారావు దొర, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ఎ.జైపాల్, డ్వామా పీడీ మధుసూదన్, ఎల్డీఎం లక్ష్మీనారాయణ, జిల్లా డీఎస్ఓ ఎ.పాపారావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు కె.తులసి, బీసీ సంక్షేమాధికారి తిక్కా వెంకటేశ్వర్లు, పలువురు జిల్లా శాఖా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 27 దరఖాస్తులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమానికి 27 అర్జీలు వచ్చాయి. నూతన ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో తొలిసారి జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీదారులు ఫిర్యాదులు అందించి తమ సమస్యలను చెప్పుకున్నారు. ఎస్పీ శ్రీధర్ ప్రతి అర్జీని పరిశీలించారు. ఎస్పీ కార్యాలయ స్పందన పర్యవేక్షణ ఎస్సై సీహెచ్ వెంకటరమణ స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు పెంచే వంగడాలు అవసరం

క్యూఆర్‌టీ చైర్మన్ డాక్టర్ జేఎస్ సందు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సాగు ఖర్చు తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులను పెంచే వంగడాల ఆవిష్కరణకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని క్యాన్‌క్యూనియల్ రివ్యూ టీం(క్యూఆర్‌టీ) చైర్మన్ డాక్టర్ జేఎస్ సందు సూచించారు. సోమవారం స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(ఐసీఏఆర్-సీటీఆర్ఐ) 2016-17 నుంచి 2021-22 వరకు చేపట్టిన పరిశోధన, ఇతర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు క్యూఆర్‌టీ చైర్మన్ డాక్టర్ ఆర్‌జే.సందు నేతృత్వంలో శాస్త్రవేత్తలు బృందం సీటీఆర్ఐని సందర్శించింది. ఈ సందర్భంగా సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అధ్యక్షతన సమీక్షా సమావేశంలో డా.జేఎస్ సందు మాట్లాడారు. ఐదు సంవత్సరాలుగా ఐసీఏఆర్-సీటీఆర్ఐ చేపట్టిన పరిశోధన,విస్తరణ కార్యక్రమాలు రైతులకు మేలు చేస్తున్నాయన్నారు. ప్రతీ శాస్త్రవేత్త రైతుక్షేత్రాన్ని సందర్శించి రైతులతో మమేకం కావాలన్నారు. పొగాకు పరిశోధనలో సాంకేతిక లోపాలు, అంతరాలు తగ్గించుకుంటే అధిక దిగుబడులు సాధ్యపడతాయన్నారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డా.ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ ఐదేళ్లలో సీటీఆర్ఐ చేపట్టిన పరిశోధన, సీటీఆర్ఐ ప్రాంతీయ పరిశోధనాసంస్థల పరిశోధక క్షేత్ర ప్రదర్శనను, కొత్త వంగడాలు, పొగాకు సాగులో యాంత్రీకరణ, బ్యారన్ల ఆధునీకరణ, వ్యర్థ పదార్థాల రీసైక్లింగ్, పొగాకు విత్తనోత్పత్తి తదితర అంశాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా క్యూఆర్‌టీ శాస్త్రవేత్తలకు వివరించారు.

ఇళ్ల లబ్ధిదారులకు డ్వాక్రా రుణం

జేసీ ధ్యానచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్ర

అమలాపురం రూరల్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో లబ్ధిదారులకు రూ.35 వేలు డ్వాక్రా రుణాలను అందించి నిరు పేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, స్పందన గ్రీవెన్స్ రీ సర్వే గృహ నిర్మాణం, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు అంశాల పురోగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండల అధికారులు గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లు సమన్వయంతో లబ్ధిదారులకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా రుణాలు ఇప్పించి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమమైన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రీ సర్వేకి సంబంధించి మొదటి దశలో 65, రెండో దశలో 55 గ్రామాలలో జనరల్ రీ సర్వే సరిహద్దురాళ్ల ఏర్పాటు పురోగతిపై సమీక్షించారు.

20 నుంచి కాలువలకు నీటి సరఫరా నిలిపివేత

ఈ నెల 20వ తేదీ నుంచి తూర్పు, మధ్య డెల్టాల కాలువలకు సాగునీటి సరఫరాను నిలుపుదల చేస్తామని, 42 సమ్మర్ స్టోరేజ్ చెరువులన, రిజర్వాయర్లను ఈ లోపుగా పూర్తిగా గోదావరి నీటితో నింపుకొని వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పురపాలక గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. జిల్లాలో 389 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చర్యలు చేపట్టాలని, రైతులు రబీ ధాన్యాన్ని ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకొని కనీస మద్దతు ధరలు పొందే విధంగా అధికార యంత్రాంగం సమన్వయం చేయాలన్నారు. మండల తహసీల్దార్లు, జలవనరులు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పంట కోతల సందర్భంగా వచ్చిన గడ్డిని సేకరించి ప్రభుత్వ స్థలాలలో నిల్వ చేయాలని డీఆర్వో సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు 0–5 మధ్య వయసు గల చిన్నారులకు ఆధార్ నమోదు తల్లిదండ్రుల బయోమెట్రిక్ సహాయంతో చేయాలని సూచించారు. కోవిడ్ వైరస్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నిర్ధారణ పరీక్షలు విస్తృతంగా చేయాలని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర వైద్యాధికారులు, వైద్యులను ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్ సీహెచ్ బాబురావు, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ గోపాలకృష్ణ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జీవీ సత్యవాణి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, సీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జలవనరుల శాఖ, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీల ధ్వంసంపై కేసు

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. ముమ్మిడివరం పెద్ద వంతెన, మట్టాడి పాలెం, దొమ్మేటివారిపాలెంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ధ్వంసం చేశారని 19వార్డుకు చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు చీకురుమిల్లి సాయి ప్రకాష్, గంటి రమేష్, మట్టా శ్రీనివాసరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమలాపురం డీఎస్పీ వై.మాధవరెడ్డి, ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య ,ఎస్సై కె.సురేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసమైన ఫ్లెక్సీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇక మూల్యాంకనం

- 19 నుంచి 26 వరకు జిల్లా కేంద్రంగా టెన్త్ స్పాట్ వాల్యుయేషన్
- ప్రతి ముగ్గురు ఏఈలకు ఒక సీఈ



అమలాపురంలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం

రాయవరం: ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు శనివారం నిర్వహించిన సోషల్ స్టడీస్‌తో ప్రశాంతంగా ముగిసాయి. దీంతో అధికారులు జవాబు పత్రాల మూల్యాంకనంపై దృష్టి సారించారు. గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టగా, ఈ ఏడాది నూతన జిల్లాల్లో స్పాట్ వాల్యుయేషన్‌ను చేపడుతున్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష పేపర్ల కోడింగ్ ప్రక్రియ చేపట్టారు. కాకినాడ జిల్లా కేంద్రమైన పీఆర్ ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల, తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీసు సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 373 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 77,183 మంది రెగ్యులర్, ప్రైవేట్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా, సరాసరిన 99.48 శాతం విద్యార్థులు హాజరయ్యారు.

5.16 లక్షల జవాబు పత్రాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 5.16 లక్షల పేపర్లను మూల్యాంకనం చేపట్టనున్నారు. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. ఇప్పటికే జవాబు పత్రాలు ఆయా జిల్లాలకు దఫదఫాలుగా వస్తున్నాయి. బయలాజికల్ సైన్స్, సోషల్, ఒకేషనల్, ఓఎస్ఎస్ సబ్జెక్టులకు చెందిన జవాబు పత్రాలు రావాల్సి ఉంది. ఆయా జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు క్యాంప్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొననున్నారు.

సబ్జెక్టుల వారీగా..

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధులకు ఆయా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తూ ఇప్పటికే ఉత్తర్వులను ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు జారీ చేశారు. స్పాట్ వాల్యుయేషన్ ఉత్తర్వులను సంబంధిత ఉపాధ్యాయులకు అందజేసే ప్రక్రియ దాదాపు ముగిసింది. ఆరు సబ్జెక్టులు, ఒకేషనల్ పరీక్షలు కలిపి మొత్తం ఎనిమిది రోజులు మూల్యాంకనం చేస్తారు.

నిబంధనలు..

మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్లు, వైట్నర్, ఎరైజర్ తదితర వస్తువులను మూల్యాంకనం గదిలోకి తీసుకు వెళ్లరాదు. ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకన సమయంలో ఎటువంటి తప్పిదాలు జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుంది. శిబిరానికి నిర్దేశిత సమయాల్లో హాజరు కాకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

తూర్పుగోదావరి జిల్లా	
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు:	01
స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి:	02
అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు:	07
ఏపీసీవోలు:	07
చీఫ్ ఎగ్జామినర్లు:	172
అసిస్టెంట్ ఎగ్జామినర్లు:	489
స్పెషల్ అసిస్టెంట్లు:	174
కాకినాడ జిల్లా	
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు:	01
స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి:	01
అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు:	06
ఏపీసీవోలు:	07
చీఫ్ ఎగ్జామినర్లు:	228
అసిస్టెంట్ ఎగ్జామినర్లు:	680
స్పెషల్ అసిస్టెంట్లు:	228
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా	
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు:	01
స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి:	01
అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు:	07
ఏపీసీవోలు:	07
చీఫ్ ఎగ్జామినర్లు:	188
అసిస్టెంట్ ఎగ్జామినర్లు:	606
స్పెషల్ అసిస్టెంట్లు:	250

పొరపాట్లకు తావు లేకుండా



మూల్యాంకన విధులకు నియమితులైనవారు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలి. స్పాట్ వాల్యుయేషన్‌లో ఎవ్వరికీ మినహాయింపు ఉండదు.

– జి.నాగమణి,
ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ,
కాకినాడ

'నిబంధనలకు విరుద్ధంగా వాలీబాల్ సంఘం ఎన్నిక'

నాగమల్లితోట జంక్షన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ సంఘ ఎన్నికలు నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగాయని, ఈ ఎన్నిక చెల్లదని వాలీబాల్ సంఘ కార్యదర్శి వై.బంగార్రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు రవిరాజు అధ్యక్షతన సంఘ సభ్యులు ఎవరికీ తెలియపరచకుండా, పేపరు ప్రకటన ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్వహించి సంఘ సభ్యులు కానివారిని జిల్లా కార్యదర్శిగా నియమించారని పేర్కొన్నారు. కోరం లేకుండా సమావేశం సాగించారన్నారు. గతంలో 2021 సెప్టెంబర్ 26న కూడా సంఘ అధ్యక్షుడు రవిరాజు ఇదే తరహాలో సమావేశం ఏర్పాటు చేసి సభ్యులు కానివారిని కార్యవర్గంలోని తీసుకోవడానికి ప్రయత్నం చేశారన్నారు. అప్పటి ఉపాధ్యక్షుడు మణిరాజు, సంయుక్త కార్యదర్శి ధనరాజు, కార్యదర్శి గణేశ్వరరావు వ్యతిరేకించారని, దీనిని గమనించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పరిశీలకులు సమావేశం అర్ధంతరంగా ముగించారని బంగార్రాజు పేర్కొన్నారు.

అన్నవరం దేవస్థానంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



అన్నవరం దేవస్థానం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం నుంచి అన్ని రకాల సేవలకు ఆన్‌లైన్ సర్వీస్ ప్రారంభించినట్లు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. స్వామివారి దర్శనం, వ్రతాల టిక్కెట్లు, కల్యాణం, గదుల రిజర్వేషన్, ప్రసాదాలు అన్నీ ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. www.aptemp er.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ సేవలు పొందవచ్చునని చెప్పారు.

రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10.00 గంటలకు పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ (మెయిన్స్), జేఈఈ (అడ్వాన్స్‌డ్), నీట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఈ మేరకు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 10వ తరగతి తరువాత చేరబోయే వివిధ కోర్సుల గురించి, ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధంగా ఉండాలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని నున్న తిరుమలరావు తెలిపారు.

జైలు పక్షులే తోడు దొంగలు

- పట్టుబడ్డ ఇద్దరిపై 85 పాత కేసులు
- కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో వరుస దొంగతనాలు
- 16 చోరీల్లో రూ.44 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

కాకినాడ క్రైం: కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల్ని పోలీసులు అరెస్టు చేశారు. పాత నేరస్తులైన వారిద్దరిపై ఏకంగా 85 కేసులు ఉండడం పోలీసుల్నే అవాక్కయేలా చేసింది. వీరు ఒకరికొకరు జైల్లోనే పరిచయం అయి వారి నేర సామ్రాజ్యాన్ని విస్తరించాలనుకున్నారు. పలుమార్లు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నా, ఈసారి మాత్రం వారి ఆట సాగలేదు. తాజాగా 16 చోరీల్లో రూ.44 లక్షల విలువైన సొత్తు దోచేసి పట్టుబడ్డారు. వీరి జిత్తులమారి తెలివితేటల్ని పసిగట్టిన పోలీసులు ఈసారి మాత్రం కట్టుదిట్టంగా వ్యవహరించారు. వివరాలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలానికి చెందిన 36 ఏళ్ల షేక్ అజీజ్ అలియాస్ నాని రాజమహేంద్రవరంలోని బొమ్మూరు వద్ద నివాసం ఉంటున్నాడు. కొత్తపేటకు చెందిన 30 ఏళ్ల యడ్ల ఉమా సూర్యవెంకటరాకేష్‌తో కలిసి నాని ఇరు జిల్లాల పరిధిలో వరుస దొంగతనాలు చేస్తున్నాడు. వీరిద్దరికీ గతంలో జైల్‌లోనే పరిచయం అయింది. గడచిన ఆరు నెలల వ్యవధిలో వీరిద్దరూ గండేపల్లి పీఎస్ పరిధిలో 186 గ్రాముల బంగారం, 7,950 గ్రాముల వెండి ఆభరణాలను దొంగిలించారు. ఈ నేరంలో ఆరు కేసులు నమోదు చేశారు. అన్నవరం, ఏలేశ్వరం పీఎస్‌ల పరిధిలో 115 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి దోచేయగా రెండు స్టేషన్లలో మూడు కేసులు నమోదయ్యాయి. పిఠాపురం రూరల్ పీఎస్‌లో 34 గ్రాముల బంగారం, 400 గ్రాముల వెండి దొంగిలించగా రెండు కేసులు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి పీఎస్ పరిధిలో 115 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, గండేపల్లి పీఎస్ పరిధిలో విదేశీ మారకం ద్రవ్యం 80 నోట్లు, 157 నాణేలు దొంగిలించిన నేరంలో మరో మూడు కేసులు నమోదయ్యాయి. వీరి దొంతనాలను నిలువరించి తీరాలని నిర్ణయించుకున్న పోలీసులు పక్కా ప్రణాళికతో వ్యూహ రచన చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్ నేతృత్వంలో జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్‌ల బృందం కీలకంగా వ్యవహరించింది. ఎట్టకేలకు ఇద్దరినీ గండేపల్లి మండలం, జెడ్ రాగంపేట గ్రామ శివారులో సోమవారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 450 గ్రాముల బంగారం, 11.85 కిలోల వెండి, 80 నోట్లు, 157 నాణేల విదేశీ మారక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.44.07 లక్షలని ఎస్పీ తెలిపారు. నిందితులిద్దర్నీ అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును మీడియాకు చూపుతున్న ఎస్పీ

ఇతర కేసుల్లో నిందితుల అరెస్ట్

జగ్గంపేట పీఎస్ పరిధిలో దొంగతనాలు చేస్తున్న పారిపల్లి దుర్గ అనే అనకాపల్లి జిల్లా కృష్ణాపురం గ్రామ మహిళను అదుపులోకి తీసుకొని విచారించి, బస్టాండ్‌లో చోరీకి గురైన 56 గ్రాముల బంగారాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలిని అరెస్టు చేశామన్నారు. సామర్లకోట పరిధిలో కారు డిక్కీ నుంచి రూ.9.9 లక్షల విలువైన సొత్తును దొంగిలించిన చిత్తూరు జిల్లాకు చెందిన కుంచవోలు సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశామని ఎస్పీ అన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన అదనపు ఎస్పీ, పెద్దాపురం డీఎస్పీ, జగ్గంపేట సీఐ, గండేపల్లి ఎస్ఐలతో పాటు కాకినాడ సీసీఎస్ డీఎస్పీ రాంబాబు, ఎస్బీ డీఎస్పీ అంబికా ప్రసాద్‌ను ఎస్పీ అభినందించారు.

క్రైం కార్నర్..

లైంగిక దాడి కేసులో బాబాయికి 10 ఏళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బాలికను లైంగిక దాడి ఘటనలో సొంత బాబాయికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఉమ్మడి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకెళితే...2019 మార్చి 15న వీరభద్రపురం ప్రాంతానికి చెందిన పొట్నూరి సత్తిరాజు తనకు కుమార్తె వరుస అయిన ఎనిమిది సంవత్సరాల బాలికను ఎవరూ లేని సమయంలో చాక్లెట్లు ఇస్తానని చెప్పి ఆమె ఇంటిలోకి తీసుకెళ్లాడు. ఆ బాలికపై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. జరిగిన ఘటనపై బాలిక తల్లిదండ్రులు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిజనిర్ధారణ కావడంతో న్యాయమూర్తి నిందితునికి జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధించారు. బాధితుల తరఫున పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీతాని శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. కేసుకు సంబంధించి కోర్టుకు పలు ఆధారాలను అందజేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి అభినందించారు.

విద్యుత్ మోటార్ల చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లు

అల్లవరం: మండలంలోని అల్లవరం, మొగళ్లమూరు, అమలాపురం టౌన్ పరిసరాల్లో విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను ఎస్సై శ్రీను నాయక్ అరెస్టు చేశారు. ఆక్వా చెరువుల వద్ద ఎవరూ లేని సమయం చూసి విద్యుత్ మోటార్లను దొంగిలించడం, వాటిని అమ్మి సొమ్ము చేసుకోవడం తాడి రమేష్, కన్నెపాముల బాబు రమేష్, ముమ్మిడివరపు శ్రీను అలవాటుగా చేసుకున్నారని ఎస్సై తెలిపారు. వీరు 11 విద్యుత్ మోటార్లను చోరీ చేసి అమ్మడానికి సిద్ధం చేయగా దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి విద్యుత్ మోటార్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్సై తెలిపారు.

రత్నగిరికి మూడో ఘాట్‌రోడ్డు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి త్వరలో మూడో ఘాట్‌రోడ్డు నిర్మించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యగిరిపై శివసదన్ నుంచి గిరి ప్రదక్షిణ రోడ్డు వరకు ఈ ఘాట్‌రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. దీనివల్ల సత్యగిరి సత్రాలలో బస చేసే భక్తులు స్వామివారి వ్రతం, దర్శనం అనంతరం తమ వాహనాలలో ఈ ఘాట్‌రోడ్డు నుంచి గిరి ప్రదక్షిణ రోడ్డు మీదుగా బెండపూడి సమీపంలోని జాతీయ రహదారికి చేరుకోవచ్చని తెలిపారు. దీనివల్ల రెండో ఘాట్‌రోడ్డులో వాహనాల ట్రాఫిక్ చాలా వరకు తగ్గుతుందని ఈఓ వివరించారు.


నమూనా ఆలయానికి ప్రతిపాదనలు

రూ.4.60 కోట్ల వ్యయంతో జాతీయ రహదారిపై దేవస్థానానికి గల 75 సెంట్ల స్థలంలో స్వామివారి నమూనా ఆలయం , ప్రసాదం కౌంటర్, షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్ బ్లాక్ నిర్మించడానికి దేవదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించినట్టు ఈఓ తెలిపారు. వాహనాల తనిఖీలలో భాగంగా త్వరలో రత్నగిరికి వెళ్లే వాహనాలన్నీ ఈఓ క్వార్టర్స్ పక్కన గల గేటు ద్వారా దేవస్థానం కళాశాల మైదానంలోకి వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అక్కడ వాహనాలను తనిఖీ చేశాక అప్పుడు రత్నగిరికి చేరుకుంటాయన్నారు. ప్రస్తుతం టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ వల్ల ఎక్కువ సంఖ్యలో వాహనాలు రోడ్డు మీద నిలిచిపోవల్సి వస్తోందన్నారు. త్వరలోనే కళాశాల మైదానంలో వాహనాల రాకపోకలకు వీలుగా రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. సత్యగిరిపై ఉచిత వివాహ మంటపాల సమీపంలో భక్తుల కోసం 60 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పున షెడ్డు నిర్మించనున్నట్టు తెలిపారు. ఆ షెడ్డుకు సమీపంలోనే టాయిలెట్స్ సముదాయం నిర్మిస్తామన్నారు. రత్నగిరి పై వివాహాలు చేసుకునే భక్తులు సింగిల్ విండో ద్వారా గదులు, పెళ్లి మంటపం, భోజనాలు, పురోహితుడు, బాజా భజంత్రీలు అన్నీ దేవస్థానమే కాంట్రాక్టర్ల ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వసతి గదుల కేటాయింపు కోసం చెకిన్, చెకౌట్ సమయంలో కుడి బొటనవ్రేలి ముద్ర వేసేలా నిబంధనలు మార్చామన్నారు.

ఉపాధ్యాయుడి తీరుపై విచారణ

తాళ్లపూడి: విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడి తీరుపై విచారణ చేసి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీవైఈవో రామన్నదొర అన్నారు. విద్యార్థులతో అసభ్యంగా వ్యవహరిస్తున్నరనే ఆరోపణపై వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొయ్యలగూడెం డీవైఈవో రామన్నదొర సోమవారం విద్యార్థులను, ఉపాధ్యాయులను విచారించారు. దీనిపై డీవైఈవో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలోని బయాలజీ ఉపాధ్యాయుడు గోపి బాలికలతొ అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్టు స్పందనలో ఫిర్యాదు చేశారని, ఈ విషయం పత్రికల్లో కూడా ప్రచురితమైందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేశామని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. మరో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై ఎంఈవో స్థాయి అధికారితో విచారణ చేస్తామన్నారు.


మోటార్ సైకిళ్లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ సురేష్‌కుమార్

యానాం: యానాం-దరియాలతిప్ప రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. యానాం ట్రాఫిక్ స్టేషన్ ఎస్సై పువ్వల వీరభద్రరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సావిత్రినగర్ నుంచి యానాం వైపునకు వెళుతున్న వ్యక్తి, యానాం నుంచి గాడిమొగ వెళుతున్న వ్యక్తి.. మోటారు సైకిళ్లు స్థానిక దరియాలతిప్ప గాయత్రి రైసుమిల్లు ఎదురుగా ఢీకొన్నాయన్నారు. సంగాడి సురేష్‌కుమార్ ముఖానికి, చేతుల కు తీవ్రగాయాలయ్యాయన్నారు. స్థానికులు హుటాహుటిన సురేష్‌కుమార్‌ను యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సను అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బైక్‌ల వెనుక కూర్చుని ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య



ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన మహాలక్ష్మి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన అంకాడి మహాలక్ష్మి(37) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి మహాలక్ష్మి ఇంట్లో దూలానికి ఉరివేసుకుని మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో దహన సంస్కారాలు చేసేందుకు ప్రయత్నించారు. తమ అన్నయ్య మృతి విషయాన్ని తమకు తెలియజేయకుండా దహన సంస్కారాలు చేస్తున్నారని కాకినాడ జగన్నాథపురానికి చెందిన మృతుడు సోదరి ఇల్లంగి లక్ష్మి అడ్డుకోవడంతోపాటు కోరంగి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసకుమార్ హుటాహుటిన తన బృందంతో శ్మశానవాటికకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కాకినాడ ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.